క్లుప్తంగా

తాగునీరు వృథా



పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

కొత్తపల్లి: నాగులాపల్లి – ఇసుకపల్లి రోడ్డులో తాగునీటి పైప్‌లైను మరమ్మతులకు గురైంది. నాగులాపల్లి ఏరియా రక్షిత నీటి పథకం పైపు లైన్లు పాడవడంతో కొంతకాలంగా తాగునీరు వృథా పోతోంది. సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సత్యశ్రీ

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో సర్పంచి కందేపల్లి సత్యశ్రీ శనివారం కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వర్గాలకు అతీతంగా పథకాలను అందజేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆమె కోరారు. పంపిణీలో పార్టీ కన్వీనర్ నక్కా శ్రీను, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు లయన్స్ క్లబ్ మూడో కేబినేట్ సమావేశం

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్ రైతు క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ మూడో కేబినేట్ సమావేశం జరుగుతుందని లయన్స్ క్లబ్ రెండో ఉప గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ప్రతినిధి కె.విజయకుమార్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని 15 లయన్స్ క్లబ్‌లకు సుగర్ వ్యాధి పరీక్షలు చేసే సుమారు రూ.కోటి విలువ చేసే కిట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్‌లతో పాటు ఉప గవర్నర్లు 15 క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ల సమావేశానికి అయ్యరక చైర్‌పర్సన్



మంత్రి వేణుగోపాలకృష్ణను కలిసిన ఆవాల రాజేశ్వరి దంపతులు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ మేరకు శనివారం విజయవాడలో జరిగిన 56 కార్పొరేషన్ల చైర్‌పర్సన్ల సమావేశంలో సామర్లకోటకు చెందిన రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సీపీఎం ఆందోళన

కొత్తపల్లి: జీఓ నెంబర్ 1 రద్దు కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు కె.నాగేశ్వరావు, సీహెచ్ నారాయణరెడ్డి, జిల్లా రైతు సంఘం కార్యదర్శి జి.అప్పారావు, ఏఐసీసీ సభ్యుడు ఓలేటి రాయ భాస్కరరావు, వి.గంగాధర్, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు కార్తీక్(ఫైల్)

కాకినాడ క్రైం: చెరువులో పడి ఐదేళ్ల బాలుడు విగత జీవిగా తేలాడు. కాకినాడలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా.. జే.రామారావుపేట ఆకాశపువారి వీధికి చెందిన పెమ్మాడి ధర్మారావు, వెంకటలక్ష్మి ఏకైక కుమారుడు ఐదేళ్ల కార్తీక్ శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు ఆడుకోవడానికి వెళ్లాడు. నిత్యం ఇంటి ఆవరణలోనే ఏదో ఒక ప్రాంతంలో ఆడుకునే బాలుడు మధ్యాహ్నం కావొస్తున్నా ఇంటికి చేరలేదు. దీంతో రెండు గంటల పాటు తల్లి వెంకటలక్ష్మితో పాటు బాలుడి నాయనమ్మ కాటవేణి స్థానికుల సాయంతో వెదికారు. మధ్యాహ్నానికి బాలుడి మృతదేహం ఇంటి సమీపంలో ఉన్న చాకలి చెరువులో తేలింది. దీంతో బాలుడిని హుటాహుటిన కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందినట్టు నిర్ధారించారు. బాలుడి తండ్రి ధర్మారావు అలియాస్ రాజు పెయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ ఘటనపై కాకినాడ వన్ టౌన్ పీఎస్‌లో కేసు నమోదైంది. కార్తీక్ ఆడుకోవడానికి వెళ్లి జారిపడి ప్రాణాలు కోల్పోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- రథాలపేటలో గడపగడపకూ

పిఠాపురం: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం రథాలపేటలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా అంటు పలకరించారు. ప్రతీ ఇంటి వద్ద ప్రభుత్వం మూడేళ్లలో అందజేసిన పథకాల వివరాలను వారికి చదివి వినిపించి అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైన్లు, మంచినీటి కుళాయిల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలు, వర్గాలతో పని లేకుండా అందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని ఆయన అన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, పచ్చిమళ్ల అప్పలరాజు, కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



పిఠాపురంలో లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు, స్థానిక నాయకులు

మత్స్యకారుల సమస్యను సీఎంకు వివరిస్తా

మత్స్యశాఖా మంత్రి సీదిరి అప్పలరాజు

పిఠాపురం: కొత్తపల్లి మండలంలో మత్స్యకారుల సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని మత్స్యశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. శనివారం రాత్రి ఆయన పిఠాపురంలో పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవిని, పురుహూతికా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తనను కలవడానికి వచ్చిన కొత్తపల్లి మండల, తీర ప్రాంత మత్స్యకార నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తీర ప్రాంతంలో నిర్మించనున్న బల్క్‌డ్రగ్ కంపెనీ వల్ల సముద్రంలో కాలుష్యం పెరిగి తమ జీవనోపాధి దెబ్బతింటుందని వారు మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన మత్స్యకారుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మత్స్యకార నాయకులు కారే శ్రీనివాసరావు, ఉమ్మిడి జాన్, కంబాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకార నాయకులతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

జీఓ ప్రకారం న్యాయం చేయండి



జిల్లా కలెక్టరు కృతికా శుక్లాకు సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న లక్ష్మి, కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న జీఓ ప్రకారం తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక బలుసులపేటకు చెందిన మహిళ శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరు కృతికా శుక్లాకు వినతి పత్రం అందజేసింది. బలుసులపేట ఇందిరా నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏలేటి లక్ష్మి తల్లి ఆయాగా పని చేస్తూ మృతి చెందింది. జీఓ ప్రకారం తల్లి పోస్టు కుమార్తెకు ఇవ్వాల్సి ఉండగా అన్యాయం చేశారని కలెక్టర్‌కు లక్ష్మి ఫిర్యాదు చేసింది. తన భర్త చనిపోయాడని, తనకు ఎటువంటి ఆదరణ లేరని ఒంటరిగా జీవిస్తున్నానని తనకు న్యాయం చేయాలని కోరింది.

రిక్షా స్టాండ్ స్థలం ఆక్రమణ..

స్థానిక బస్సు కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రిక్షా స్టాండ్ స్థలాన్ని కొంత మంది వ్యాపారులు ఆక్రమించి రిక్షా కార్మికులకు అన్యాయం చేస్తున్నారని కౌన్సిలర్ నేతల హరిబాబు కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఈ రిక్షా స్టాండ్‌పై ఆధారపడి 100 మంది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. కూలిపోయిన రిక్షా స్టాండ్ షెడ్‌ను నిర్మించి రిక్షా కార్మికులను ఆదుకోవాలన్నారు. రెండు సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టరు హామీ ఇచ్చారు.

సంక్రాంతిని సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలి



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెద్దాపురం: సంక్రాంతి పర్వదినాన్ని సంప్రదాయ పద్ధతిలోనే జరుపుకోవాలని పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అబ్దుల్‌నబీ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ కుటుంబ సమేతంగా జరపాల్సిన సంప్రదాయ పండగల్లో సంక్రాంతి ఒక్కటన్నారు. అటువంటి సంక్రాంతిని జూదం పేరుతో సంతోషాన్ని మానుకోవడం తగదన్నారు. సీఐ నబీ మాట్లాడుతూ సాంప్రదాయ క్రీడలను మాత్రమే ప్రజలు ఆడుకోవాలన్నారు. కోడి పందేలు, జూదాల జోలికి పోవద్దన్నారు. అనంతరం ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, పేరింశెట్టి అంబిక, మృత్యుంజయరావు, సిద్ధి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి శృంగార వల్లభుడి దర్శనానికి

బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతిగా పిలిచే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. వేకువ జాము నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గంటల తరబడి భక్తులు క్యూలోనే నిల్చున్నారు. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణ మూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూలైన్లోనే నిలిచారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామి వారికి తులసీ మాలంకరణ చేసి దాతలు, భక్తులకు ఆశీర్వచనం అందించారు. ఆలయ భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, టికెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు రూ.02,07,199 ఆదాయం సమకూరినట్టు ఈఓ పులి నారాయణమూర్తి, తెలిపారు. అనంతరం నిర్వహించిన ఉచిత పులిహోర ప్రసాదంతో పాటు అన్నదానంలో భక్తులు క్యూ కట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ హాజరు కాగా, సుమారు ఐదువేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.



తిరుపతి శృంగారవల్లభ స్వామి

జిల్లాలో 762 కేంద్రాల ద్వారా సంపద తయారీ

- చెత్తనుంచి సంపద కేంద్రాలపై ప్రత్యేక డ్రైవ్
- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి
- జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



వాకతిప్పలో ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

కొత్తపల్లి: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 762 చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా ఎరువు తయారవుతోందని, వీటి ద్వారా సుమారు ఏడాదికి రూ.8 లక్షలు ఆదాయం లభిస్తోందని జెడ్పీ సీఈఓ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వాకతిప్ప, కొత్తపల్లిలో ఉన్న ఈ కేంద్రాలను, నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి సరఫరా పథకాన్ని, పొన్నాడలోని ప్రభుత్వ లే అవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణదారులతో లే అవుట్‌లో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, ఈ కేంద్రాల ఏర్పాటుతో ఇళ్ల వద్ద చెత్త ఉండదని, ఆయా కేంద్రాల్లో ఎరువు తయారీ వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరుతోందని సీఈఓ అన్నారు. ప్రతీ మండల కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి తడి-పొడి చెత్త కేంద్రం తయారు చేసిన ఎరువును విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. మండలాల్లో ఉన్న తాగునీటి పథకాల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టులు, పంచాయతీలకు సంబంధించిన ఫలసాయం పాట గత ఏడాదికంటే 5, 10 శాతం ఆదాయం వచ్చేలా ఉండాలన్నారు. ప్రతీ శనివారం నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌లో లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ నందూరి ప్రభాకర రామారావు, ఈఓపీఆర్డీ భాస్కర్, వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కాంట్రాక్టర్లు పనులు వేగంగా పూర్తి చేయాలి



సామర్లకోట కాంట్రాక్టు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో టెండర్ల ఆమోదం పొందిన వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి అన్నారు. శనివారం చైర్‌పర్సన్ చాంబర్‌లో చైర్‌పర్సన్ అధ్యక్షతన కాంట్రాక్టు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మాట్లాడుతూ నీలమ్మ చెరువు అభివృద్ధి నిధులున్నా ఎందుకు పనులు జరగడం లేదని ప్రశ్నించారు. బిల్లులు పెండింగ్ కావడం వల్ల పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్ సత్యనారాయణ తెలిపారు. గతంలో కమిషనర్, మున్సిపల్ డీఈల మధ్య సఖ్యత లేకపోవడం వల్ల బిల్లులు జాప్యం జరిగేదని ప్రస్తుతం అటువంటి సమస్య రాదని పనులు వేగంగా పూర్తి చేయాలని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు సూచించారు. రూ.84 లక్షలతో నీలమ్మ చెరువు అభివృద్ధి జరుగుతున్నాయని, వాటిని వేగంగా పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే సమయంలో ఆయా వార్డుల కౌన్సిలర్లను పిలిచి నాణ్యతగా జరిగేలా చూడాలన్నారు. నీలమ్మ చెరువు పనులను ఒక చాలెంజ్‌గా కౌన్సిల్ తీసుకోవడం జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని పనులు జరగాలన్నారు. అదే విధంగా 15వ ఆర్థిక సంఘ నిధులకు సంబంధించి ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం జరిగినా టెండర్లు పిలవక పోవడంపై వైస్ చైర్మన్ మోజెస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా 14, 15 ఆర్థిక సంఘ నిధులతో జరుగుతున్న పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. రూ.కోటితో ఆమోదించిన అమ్మాణమ్మ అపార్టుమెంట్ రోడ్డు పనులను కాంట్రాక్టరు వెంటనే పనులు ప్రారంభించాలని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు సూచించారు. కాంట్రాక్టు కమిటీ సమావేశానికి సంబంధించి కాంట్రాక్టర్లకు సమాచారం లేకపోవడంపై సిబ్బందిపై మోజెస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి కమిషనర్ హాజరు కాకపోవడంపై నేతల హరిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. గోదావరి కాలువలో కాలుష్య జలాలపై చర్యలు తీసుకోవాలని నేతల హరిబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ డీఈ హుస్సేన్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రతి అంశంపై అవగాహన కల్పించాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్



శాంతివర్ధనలో న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి హర్షవర్ధన్

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతి అంశం పైనా పూర్తి అవగాహన కల్పించాలని పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్ అన్నారు. లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి హర్షవర్ధన్ పాఠశాల నిర్వహణ స్థితిగతులపై పాఠశాల నిర్వాహకుడు రాయవరపు వీరబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సత్యవేణి మాట్లాడుతూ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రతి అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫిజియోథెరపీ, ఒకేషనల్ శిక్షణ, 18 ఏళ్లు నిండిన విద్యార్థులకు ఫెనాయిల్, సబ్బుల తయారీ, కుట్టుమిషన్, భోజనం ప్లేట్లు తయారీ, శానిటరీ ప్యాడ్స్ తయారీపై శిక్షణ ఇస్తారన్నారు. శాంతివర్ధన చేస్తున్న సేవలను జడ్జి హర్షవర్ధన్ అభినందించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన న్యాయ సేవలపై న్యాయవాదులు ఎ.ప్రభుజీ, ఎం.రాంబాబు, ఎస్.విశాలక్ష్మి, కేవీ చలం, ఎస్.దుర్గారావు, పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, కె.నానిబాబు, పాఠశాల ఏఓ వేణు, బాబి, శివ, అప్పలరాజు, బోధన, బోధనేతర సిబ్బంది, విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల వసతి గృహానికి కొత్త భవనం నిర్మిస్తాం

కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: నగరంలోని సాంబమూర్తినగర్ ప్రభుత్వం అంధుల వసతి గృహానికి సంబంధించి కొత్తగా స్థలం కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. శనివారం కాకినాడ ఇందిరాకాలనీలో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమాన్ని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తనిఖీ చేశారు. వసతి గృహం ప్రస్తుత పరిస్థితి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వసతి గృహం గదులు తదితరాలను కలెక్టర్ పరిశీలించి అంధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ బధిరుల పాఠశాల, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వికలాంగుల శిక్షణ, ఉత్పత్తి కేంద్రాన్ని సాంబమూర్తినగర్ రెవెన్యూ కాలనీలో ఉన్న ప్రభుత్వ బధిరుల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. బధిరుల బాలిక వసతి గృహం, వికలాంగుల శిక్షణ ఉత్పత్తి కేంద్ర తదితరాలను తనిఖీ చేశారు. ఇందిరా కాలనీలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. ఖాళీ స్థలం తక్కువగా ఉండటంతో పాటు ఇతర సమస్యల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ నేపథ్యంలో అంధుల వసతి గృహానికి సంబంధించి కొత్తగా స్థలం మంజూరు చేస్తామన్నారు. త్వరలోనే సీఎస్‌ఆర్ ఫండింగ్ కింద నిధులు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపడతామని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు.



వసతి గృహంలో అంధులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఆదర్శలో సంక్రాంతి సంబరాలు



హరిదాసుకు దక్షిణ వేస్తున్న యువతులు



ఆకట్టుకున్న రంగవల్లులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. రంగవల్లులు, భోగి మంటలు, హరిదాసు, ఎడ్ల బళ్లు, డూడూ బసవన్నలతో విద్యార్థులు సందడి చేశారు. కళాశాల చైర్మన్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినీనటి అనసూయకు బాహుబలి కాజా



బాహుబలి కాజాతో అనసూయ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): టీవీ యాంకర్, సినీనటి అనసూయ భరద్వాజ్‌కు శనివారం సురుచి పీఆర్వో వర్మ బాహుబలి కాజా అందించి సత్కరించారు. పెద్దాపురంలో షోరూమ్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెకు కాకినాడలోని ఒక హోటల్‌లో ఈ కాజా అందించినట్టు ఆయన వివరించారు. జిల్లాకు ప్రముఖులెవ్వరు వచ్చినా బాహుబలి కాజా అందివ్వడం సురుచి సంప్రదాయమన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ చర్యలు వేగవంతం చేయాలి

కాకినాడ రూరల్: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకి సంబంధించి ప్రతాలు పంపిణీ వేగవంతం చేయాలని కాకినాడ ఆర్డీఓ బి.వి.రమణ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన తహసీల్దార్ మురార్జీ, డీటీ కల్యాణ్, సర్వేయర్ ఆచార్యులు తదితరులతో సమీక్ష నిర్వహించారు. భూ హక్కు పత్రాల పంపిణీలో అశ్రద్ధ వద్దన్నారు. పత్రాల్లో ఏమైనా సవరణలు ఉంటే స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో 42,637 భూ హక్కు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాకినాడ రూరల్‌లోని 13 రెవెన్యూ గ్రామాల్లో 4572 భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు.